




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ : నరేంద్ర


గుంటూరు | సంపుటి : 1 | సంచిక : 61 | పేజీలు : 8 | శనివారం 28 ఫిబ్రవరి 2026 | వెల : 4/-





## తమిళనాడులో ప్రజాస్వామ్యానికి గొప్ప చరిత్ర

- ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు!
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- ప్రాచీన కాలం నుంచే తమిళనాడులో కుడవోలై విధానం
- అది ప్రపంచానికి ఆదర్శం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు



# న్యాయం ఎవరి బాధ్యత?

19 ఎళ్ళ తరవాత కూడా సమాధానం లేని అయేషా మీరా ప్రశ్న..
దర్యాప్తు వైఫల్యమా...లేక వ్యవస్థల మౌనమా

*తెనాలిలో ఆయేషా మీరా శరీర అవశేషాలు మరోసారి మట్టిలో కలిసిపోయిన క్షణం---ఒక అంత్యక్రియ కాదు, ఒక సమాజం ఆత్మను కుదిపేసిన దృశ్యం. 19 సంవత్సరాలుగా న్యాయం కోసం ఎదురుచూసిన ఒక కుటుంబం కన్నీళ్ల మధ్య "మాకు సమాధానం దొరకలేదు" అని చెప్పిన ఆ క్షణం, రాష్ట్రాన్నే కాదు దేశాన్ని ఆలోచనలో ముంచింది. దోషులు ఎవరు అన్న ప్రశ్నకు సమాధానం లేకుండా దర్యాప్తు సంస్థలు చేతులెత్తేయడం, న్యాయవ్యవస్థ నిశ్శబ్దంగా ఉండిపోవడం---ఇవి ఒక్క హత్య కేసు పరిణామాలు మాత్రమే కాదు. ఇవి వ్యవస్థల వైఫల్యానికి నిలువెత్తు సాక్ష్యం.*

3



ఎడిటర్ నరేంద్ర

## ఏపీ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ లీసా గిల్



**అమరావతిరక్షణ న్యూస్**

సుప్రీంకోర్టు కొలీజియం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా (సీజే) జస్టిస్ లీసా గిల్ నియామకానికి సిఫారసు చేసింది. ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం జస్టిస్ లీసా గిల్ పంజాబ్ ఒ హర్యానా హైకోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె దీ.ూా. ూా.దీ, ూా.వీ పూర్తిచేసి 1990లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2014లో పంజాబ్ ఒ హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు నూతన సీజేగా జస్టిస్ లీసా గిల్ నియామకం ఖరారైతే, న్యాయపాలనలో అనుభవంతో పాటు పరిపాలనా నైపుణ్యాలు మరింత బలపడతాయని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## లోటు బడ్జెట్‌లోనూ అభివృద్ధి ఆగదు



గ్రామాల అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రూ.9.31 కోట్ల పనులకు శ్రీకారం

మంత్రి కొలుసు పార్థసారథి

*రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత లేదని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార--పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో రూ.9.31 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శ్రీకారం చుట్టారు.*




## లిక్కర్ పాలసీ కేసులో అందరికీ విముక్తి

న్యాయవ్యవస్థపై నమ్మకం నిలిచింది: కల్వకుంట్ల కవిత

కేజ్రీవాల్, సిసోడియాలకు డిశ్చార్జ్

సీబీఐ దర్యాప్తులో తీవ్ర లోపాలు

### ఈ ఏడాది 10 లక్షల ఇళ్లకు

# గృహప్రవేశాలు

**వ్యవసాయం--హౌసింగ్ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం**

ప్రతి పేదవానికి సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల ఇళ్లకు పైగా గృహప్రవేశాలు చేయిస్తామని, ఇళ్లు లేని పేదలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. శాసనసభలో హౌసింగ్, వ్యవసాయ శాఖల బడ్జెట్‌పై ప్రసంగిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు బాధ్యులను చట్టపరంగా శిక్షిస్తామని ప్రకటించారు. అగ్రిటెక్, ఐదు సూత్రాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారు.

3





## బొత్స సత్యనారాయణకు బ్రెయిన్ స్ట్రోక్

హైదరాబాద్‌కు తరలింపు -- సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స

ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యుల వెల్లడి

### పెట్టుబడులతోనే

# ప్రగతి సాధ్యం



**అభివృద్ధి చెందిన రాష్ట్రాలే దేశాన్ని బలంగా చేస్తాయి**

**కష్టకాలంలో వెన్నంటి నిలిచిన పవన్ కళ్యాణ్ నా పెద్దన్న : మంత్రి నారా లోకేష్**

**తిరుమల లడ్డూ కల్తీ బాధ్యులు చట్టం నుంచి తప్పించుకోలేరు**

అభివృద్ధి చెందిన రాష్ట్రాలే దేశాన్ని బలంగా తయారుచేస్తాయని, నైతికత, విలువలు లేని అభివృద్ధికి అర్థం లేదని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ముంబయిలో జరిగిన ఐడియాస్ ఆఫ్ ఇండియా--2026 సదస్సులో ఆయన రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, అమరావతి భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు.

3

## నా బిడ్డకు న్యాయం జరగ లేదు

ఆయేషా మీరా అవశేషాలకు తెనాలిలో అంత్యక్రియలు

న్యాయం జరగలేదంటూ తల్లిదండ్రులు, ముస్లిం మతపెద్దల ఆవేదన

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్



ఆయేషా మీరా కేసులో న్యాయం జరగలేదంటూ ఆమె తల్లిదండ్రులు మరోసారి ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఆయేషా మీరా శరీర అవశేషాలను కుటుంబానికి అప్పగించగా, తెనాలిలోని ఈద్గా వద్ద ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా ప్రజలు తరలివచ్చారు.

## మోదీ, అమిత్‌షా కుట్ర

**న్యూఢిల్లీ:** ఢిల్లీ ప్రభుత్వ మాజీ ఎక్సైజ్ (లిక్కర్) విధానానికి సంబంధించిన స్కాంలో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా భారీ ఊరట లభించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అవినీతి కేసులో సహా నిందితులందరినీ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆప్‌నేత కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కాం కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత, కేజ్రీవాల్ బీజేపీపై తన దాడిని ఎక్కుపెట్టారు. తనపై తప్పుడు కేసులు బనాయించి,తనను ఆమ్ ఆద్మీ పార్టీని అంతం చేయాలని ప్రధాని మోదీ, అమిత్ షా ద్వయం కుట్ర పన్నిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలకు స్పందిస్తూ, తనపై, తన పార్టీపై వచ్చిన అన్ని ఆరోపణలు నిరాధారమైనవని తేలిందని కేజ్రీవాల్ అన్నారు. ఈ కేసులో సీబీఐ ,ఈడీ ఛార్జ్ షీట్లు దాఖలు చేసినప్పటికీ, ప్రాసిక్యూట్ చేయడానికి తగిన ఆధారాలు ఉన్నాయా లేదా అనే దానిపై తుది నిర్ణయం కోర్టుదేనని స్పష్టం చేశారు. కేసును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, కేసును కొనసాగించ డానికి ఖచ్చితమైన ఆధారాలు లేవని కోర్టు తేల్చిందని కేజ్రీవాల్ అన్నారు. కేజ్రీవాల్‌కు క్లీన్ చిట్ రావడంతో అటు ఆప్ శ్రేణులు, ఇటు ఆయన భార్య సునీత ఆనందంలో మునిగి తేలారు. భర్తను ఆలించగనం చేసుకొని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు.

## ఇరాన్‌తో ఉద్రిక్తతలు

ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ, ఇజ్రాయెల్‌ను వెంటనే వీడాలని అమెరికా రాయబారి మైక్ హకబీ అక్కడి ఎంబసీలోని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్, అమెరికా మధ్య గత కొన్నాళ్ళుగా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఈ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఇజ్రాయెల్‌ను వీడి స్వదేశానికి వెళ్లాలని సూచించారు. సిబ్బంది అమెరికా వెళ్లడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు భయపడాల్సిందేమీ లేదని, కానీ ఇరాన్‌పై అమెరికా భీకర దాడికి ముందే ఇజ్రాయెల్‌ను వీడితే మంచిదని సూచించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్‌పై దాడులకు దిగే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. తమతో అణుఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికలు చేసినప్పటికీ అణు ఒప్పంద చర్చలు అంత ఫలప్రదంగా ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఇజ్రాయెల్‌లోని తన ఎంబసీకి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. అమెరికా తమపై దాడి చేస్తే ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ఇప్పటికే పలుమార్లు అమెరికాకు స్పష్టం చేసింది. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను నాశనం చేస్తామని ప్రకటించింది.

## కోల్‌కతాలో భారీ భూకంపం, వణికిపోయిన జనం



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని నగరం కోల్‌కతాలో శుక్రవారం మధ్యాహ్నం భారీ భూకంపం సంభవించింది. కోల్‌కతా, దాని పరిసర జిల్లాల్లో భూకంపాలు సంభవించాయి. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (చీజూ) ప్రకారం, భూకంపం రిక్టర్ స్కేలుపై 5.5 తీవ్రతతో నమోదైంది. 10 కి.మీ లోతులో సంభవించిన ఈ భూకంపం నైరుతి బంగ్లాదేశ్‌లో కేంద్రంగా ఉంది. భారతదేశం-బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలోని పరిసర జిల్లాల్లో కూడా భూకంపం సంభవించింది. దీని తీవ్రతను రిక్టర్ స్కేల్‌పై 5.4గా గుర్తించారు. ఇది 35 కి.మీ (21.75 మైళ్ళు) లోతులో సంభవించిందని యూరోపియన్ మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ (జుమీజ) తెలిపింది. కోల్‌కతా నగరం, పరిసర ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు ఈ ప్రకంపనలు కొనసాగాయి. ఎత్తైన నివాస సముదాయాలు, రద్దీగా ఉండే మార్కెట్‌లలో భూమి కంపించడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. తాజా సమాచారం దీని వలన ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టంగా జరగలేదు. స్థానికుల ప్రకారం ప్రకంపనల సమయంలో సీలింగ్ ఫ్యాన్లు ఊగడం, ఫర్నిచర్ కంపించడం, కిటికీలు కొట్టుకోవడం లాంటివి సంభవించాయి. బహుళ అంతస్తుల భవనాలలో దీని ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఈ ఘటనకు సంబంధించిన సోషల్ మీడియాలో అనేక వీడియోలు వైరల్‌గా మారాయి.

## మద్యం పాలసీ కేసు విచారణపై స్పందించిన ఈడీ - హైకోర్టును ఆశ్రయించిన సీబీఐ

దిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనిలాండరింగ్ కేసు స్వతంత్రత కలిగిందని ఈడీ అధికారులు తెలిపారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసు నుంచి మాజీ సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా సహా నిందితులందరికీ దిల్లీ కోర్టు ఊరట కలిగించిన నేపథ్యంలో ఈడీ ఈ వ్యాఖ్యలు చేసింది. తమ దర్యాప్తు కేవలం సీబీఐ కేసుపై ఆధారపడి లేదని పక్కా సాక్ష్యాధారాలతో విచారిస్తున్నామని ఈడీ అధికారులు తెలిపారు. దిల్లీ మద్యం పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, ఇతరులను నిర్దోషులుగా విడుదల చేస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈడీ అధికారుల ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. విజయ్ మదన్‌లాల్ కేసులో సుప్రీంకోర్టు 2022లో ఇచ్చిన తీర్పు మేరకు ప్రధాన కేసు కొట్టివేస్తే దానికి అనుబంధంగా ఉన్న మనీ లాండరింగ్ కేసు కూడా రద్దవుతుంది. అయితే, ఈడీ మాత్రం ప్రధాన కేసు ఫలితంతో సంబంధం లేకుండా మనీ లాండరింగ్‌ను ఒక స్వతంత్ర నేరంగా పరిగణించాలని కోరుతోంది. దిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించి, తమ ఛార్జిషీట్లలో సమర్పించిన ఆధారాలు విశ్వసనీయమని ఈడీ పేర్కొంది. సీబీఐ సమర్పించిన ఆధారాలకంటే తమ ఆధారాలు చాలా భిన్నమైనవని తెలిపింది. అక్రమంగా సంపాదించిన నిధులను ఎలా సేకరించారో, ఎలా వినియోగించారో వివరంగా ఛార్జిషీట్లలో వెల్లడించామని ఈడీ అధికారులు తెలిపారు. మరోవైపు, ట్రయల్ కోర్టు ఇంకా ఈడీ కేసు మేరిట్‌పై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు స్పష్టం చేశారు. అవసరమైన సమయంలో తమ వాదనలు కోర్టులో వినిపిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా, మనీ లాండరింగ్ కేసును ప్రిడికేట్? నేరం నుంచి వేరుచేయాలా? లేదా విజయ్ మదన్‌లాల్ కేసులో నిర్వహించిన విధంగా కొనసాగించాలా? అనే అంశంపై కూడా సుప్రీంకోర్టు పరిశీలిస్తోందని తెలిపారు. దిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కె. కవిత సహా మొత్తం 23 మంది నిందితులను ఈ కేసు నుంచి డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ట్రయల్ కోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే సీబీఐ దీనిపై దిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. దర్యాప్తులోని పలు కీలక అంశాలను రౌస్ అవెన్యూ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, కొన్ని ముఖ్యమైన సాక్ష్యాలను విస్మరించిందని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులపై స్టే విధించాలని సీబీఐ కోరింది.

### ఈ కేసులో మొత్తం 8 ఛార్జిషీట్లు దాఖలు

ఇదిలా ఉండగా, ఈ కేసులో ఈడీ ఇప్పటివరకు మొత్తం ఎనిమిది ఛార్జిషీట్లు దాఖలు చేసింది. మొత్తం 40 సంస్థలను నిందితులుగా పేర్కొంది. కేజ్రీవాల్?, సిసోడియాలతో సహా 18 మందిని అరెస్ట్ చేసింది. ఈడీ తన ఛార్జిషీట్లలో కేజ్రీవాల్‌ను ఎక్సైజ్ కుంభకోణంలో 'కింగ్‌పిన్' పేర్కొంది. నాటి ప్రభుత్వంలోని దిల్లీ మంత్రులు, ఆప్ నాయకులు, ఇతరులతో కలిసి కుట్ర పన్నారని ఆరోపించింది. మరోవైపు, ఈ పరిణామాలపై స్పందించిన కేజ్రీవాల్, తనపై నమోదైన అవినీతి కేసు స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర అని ఆరోపించారు. తమపై తప్పుడు ఆరోపణలు చేసి రాజకీయంగా ఇబ్బంది పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

# దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు ముందుకు రావాలి



దేశాభివృద్ధికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఆవిష్కరణలతో ముందుకు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయా పరిశ్రమలకు ఆర్థిక సంస్థలు ఆచరణాత్మక పరిష్కారాలతో అండగా నిలిచి మార్కెట్ నమ్మకాన్ని పెంచాలని సూచించారు. 'వికసిత్? భారత్' కోసం సాంకేతికత, సంస్కరణలు, ఆర్థికం అనే అంశంపై నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు.

ప్రభుత్వం, పరిశ్రమలు, విజ్ఞాన భాగస్వాములు కలిసినప్పుడే సంస్కరణలు ఫలితాలుగా మారుతాయని మోదీ పేర్కొన్నారు. కాగితంపై ఉన్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా సాకారం అవుతాయని వివరించారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందని ప్రధాని తెలిపారు. 11 ఏళ్ల క్రితం కేవలం రూ. 2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ. 12 లక్షల కోట్లకుపైగా పెరిగాయని వివరించారు. ఈ భారీ కేటాయింపులు ప్రైవేట్ రంగానికి ఒక సంకేతమని పేర్కొన్నారు. మరోవైపు, బడ్జెట్‌లోని విషయాలపై మరింత చర్చ జరిపేకంటే దాని తక్షణ అమలుపై దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ వాటాదారులను కోరారు.

"బడ్జెట్ గురించి చర్చించడం దీని ఉద్దేశం కాదు. వీలైనంత త్వరగా బడ్జెట్‌ను అమలు చేయడం, అది సులభమైన మార్గంలో చేయడం దీని ఉద్దేశం. వాటాదారులందరూ దీని నుంచి ప్రయోజనం పొందాలి. బడ్జెట్‌ను కేవలం స్వల్పకాలిక వ్యాపార పత్రంగా చూడకూడదు. అది ఒక విధానపరమైన మార్గదర్శి. బడ్జెట్ ప్రభావాన్ని పటిష్టమైన, వాస్తవిక పారామితులపై అంచనా వేయాలి. ఇలాంటి విధానాలు మౌలిక సదుపాయాలను విస్తరించాలి. రుణ లభ్యతను మరింత సరళతరం చేయాలి. సులభతర వాణిజ్యాన్ని పెంచాలి. పాలనలో పారదర్శకత పెరగాలి. ప్రజల జీవనం మరింత సులభతరం కావాలి. బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన నిర్ణయాలు మాత్రమే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. అత్యంత గొప్ప విషయం ఏమిటంటే ఏ బడ్జెట్‌ను కూడా వేరు చేసి చూడడానికి వీల్లేదు. దేశ నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ. ప్రతీ బడ్జెట్ ఒక పెద్ద లక్ష్యాన్ని చేరుకునేందుకు ఒక అడుగు అవుతుంది. మన ముందు ఉన్న ఆ పెద్ద లక్ష్యం ఏమిటంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావని. ప్రతీ సంస్కరణ, ప్రతీ మార్పు ఈ సుదీర్ఘ ప్రస్థానాన్ని దృష్టిలో పెట్టుకొని మాత్రమే చేయాలి."

అదేవిధంగా, ఆర్థిక రంగం గురించి కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చర్చించారు. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి బాండ్? మార్కెట్లను మెరుగుపరిచేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడి చట్రాన్ని మరింత అనుకూలంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. "విదేశీ పెట్టుబడి చట్రాన్ని సులభతరం చేస్తున్నాం. పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడానికి మేం ప్రయత్నిస్తున్నాం. దీర్ఘకాలిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడా నికి బాండ్ మార్కెట్లను మరింత చురుగ్గా చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నాం. బాండ్లను కొనుగోలు చేయడం, అమ్మడం వంటి ప్రక్రియను సులభతరం చేస్తున్నాం. దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడే బాండ్ మార్కెట్ సంస్కరణలను మనం చూడాలి. స్థిరమైన విదేశీ మూలధనాన్ని ఆకర్షించడానికి మనం సరికొత్త సాధనాలను తీసుకురావాలి. ప్రభుత్వం, పరిశ్రమ, ఆర్థిక సంస్థలు, విద్యాసంస్థల మధ్య ఉమ్మడి వెంచ ర్‌గా స్పష్టమైన సంస్కరణ భాగస్వామ్య చార్టర్?ను అభివృద్ధి చేయాలి" అదేవిధంగా పరిశ్రమలు నూతన ఉత్సాహంతో ముందుకు రావాలని ప్రధాని మోదీ కోరారు. 2026-27 బడ్జెట్‌లో ప్రకటించిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థల మధ్య సమన్వయం కోసం 'రిఫార్మ్ పార్టనర్‌షిప్ చార్టర్' రూపొందించాలని ప్రధాని ప్రతిపాదించారు. 2047 నాటికి 'వికసిత్? భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ పత్రం కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# తమిళనాడులో ప్రజాస్వామ్యానికి గొప్ప చరిత్ర




తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్? రాష్ట్ర రాజకీయ పార్టీలతో కీలక సమావేశం నిర్వహించారు. చెన్నైలో జరిగిన ఆ సమావేశంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎన్నికలను ఒకే దశలో నిర్వహించాలని ఎక్కువ పార్టీలు కోరినట్టు అధికారులు తెలిపారు. డబ్బు, బహుమతుల ప్రలోభాలకు కట్టడి విధించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాన్ని భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిషనర్‌లతో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణ, భద్రత, సిబ్బంది శిక్షణ, ఈవీఎంల నిర్వహణ, చట్టవ్యవస్థ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను సమీక్షించారు.

### కఠిన చర్యలు తప్పవు

రాజకీయ పార్టీలు ఎన్నికల్లో డబ్బు ప్రభావం, ఉచిత పథకాల పంపిణీ వంటి అక్రమాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరాయి. అక్రమాల నివారణకు ఫ్లయింగ్ స్క్వాడ్ల సంఖ్యను పెంచాలని కూడా సూచించాయి. దీనిపై స్పందించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికలు ఎప్పటికీ చట్టబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రలోభాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా!

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. తమిళనాడుకు ప్రజాస్వామ్యంలో గొప్ప చరిత్ర ఉందని, ప్రాచీన కాలంలోనే కుడవోలై విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. ఇది ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. ఇటీవల 72 దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ సమావేశం నిర్వహించి, తమిళనాడులో శతాబ్దాల క్రితమే అమలులో ఉన్న ఎన్నికల విధానం గురించి వివరించామని తెలిపారు. ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

### ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతోందని ఆయన తెలిపారు. అర్హులెవరూ తప్పిపోకూడదని, అనర్హులెవరూ జాబితాలో చేరకూడదనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని చెప్పారు. తమిళనాడులో అమలు చేస్తున్న విధానం దేశానికి మోడల్‌గా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 75 వేల పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించనున్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు అందరికీ సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరింతగా!

ఎన్నికల పారదర్శకతను పెంచేందుకు కొత్త చర్యలు తీసుకున్నట్టు సీఈసీ వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ఈవీఎంల లెక్కింపుకు ముందే పూర్తి చేయనున్నారు. ప్రతి నియోజకవర్గంలో తప్పనిసరిగా వీవీప్యాట్ స్లిప్‌ల లెక్కింపు జరుగుతుందని స్పష్టం చేశారు. లెక్కింపు అనంతరం అభ్యర్థులు ఫీజు చెల్లించి ఏడు రోజుల లోపు ఈవీఎంలను వీవీప్యాట్‌లతో సరిపోల్చుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. దీనివల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని చెప్పారు.

### పక్షపాతం లేకుండా విధులు

ఇటీవల జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలు, వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. చట్టవ్యవస్థ పటిష్టంగా ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అధికారులు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా, పక్షపాతం లేకుండా విధులు నిర్వర్తించాలని కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన వారిపై జీరో టాలరెన్స్ విధానం పాటిస్తామని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, ఎన్నికల తేదీల నిర్ణయంలో పండుగల తేదీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరాయి. దీనిని పరిశీలిస్తామని సీఈసీ హామీ ఇచ్చారు. మొత్తానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సన్నాహాలు జరుగుతున్నాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# రసవత్తరంగా తమిళ రాజకీయాలు

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దివంగత సీఎం జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా గుర్తింపు పొందిన, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలో చేరారు. అధికార ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే)లో ఆయన శుక్రవారం అధికారికంగా చేరడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సమక్షంలో చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఓపీఎస్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అన్నాడీఎంకేలో కీలక పదవులు నిర్వహించిన పన్నీర్‌సెల్వం, 2022లో పార్టీ అంతర్గత అధికార పోరాటం తర్వాత బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాత మళ్లీ తన మాతృపార్టీలోకి చేరేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో చివరకు రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని డీఎంకేలో చేరినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు తన కుమారుడు పి. రవీంద్రనాథ్ కుమార్, అనుచరులు కూడా డీఎంకేలో చేరడం విశేషం.

### స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం

డీఎంకేలో చేరిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఓపీఎస్, అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పార్టీకి భవిష్యత్‌లో ఎలాంటి విజయం దక్కకుండా చేసే పరిస్థితిని పళనిస్వామి సృష్టించారు. ఆయన నిరంకుశుడు, అహంకారి. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నాశనం చేశారు" అంటూ మండిపడ్డారు. గతంలో తనకు జరిగిన విషయాల గురించి ఇప్పుడు ఆలోచించడం లేదని, ఇకపై సీఎం స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం చేశారు. స్టాలిన్ నాయకత్వంపై ప్రశంసలు కురిపించిన ఓపీఎస్, "ప్రజల అవసరాలు అర్థం చేసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు స్టాలిన్. అందరికీ సమానంగా పాలన అందిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ద్రవిడ సిద్ధాంతాల పరిరక్షణ కోసం డీఎంకే కట్టుబడి ఉంది" అని అన్నారు. ఇకపై తాను కూడా సాధారణ కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఇక అసెంబ్లీలో కూడా ఈ రాజకీయ మార్పు ప్రభావం కనిపించింది. ఓపీఎస్ వర్గానికి చెందిన ఎమ్మెల్యే పి. అయ్యప్పన్, స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటూ ప్రసంగించారు. ముఖ్యంగా పాఠశాల పిల్లల కోసం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రశంసిస్తూ, "తల్లిలా పిల్లలకు ఆహారం అందించే ప్రభుత్వం ఇది" అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేనే మళ్లీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఈ పరిణామంపై ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్‌డీఏ మిత్రపక్షమైన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ ధినకరన్ స్పందిస్తూ, "ఓపీఎస్‌కు తనకు నచ్చిన కూటమిలో చేరే హక్కు ఉంది. కానీ జయలలితా వారసత్వాన్ని ఈ నిర్ణయానికి కారణంగా చూపడం సమంజసం కాదు" అన్నారు. ఆ వ్యాఖ్యలు జయలలిత అభిమానులకు ఆమోదయోగ్యం కావని స్పష్టం చేశారు. రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల ముందు ఓపీఎస్ నిర్ణయం రాజకీయ సమీకరణాలను మార్చే అవకాశముంది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో గత ఎన్నికల్లో డీఎంకే కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించింది. ఇప్పుడు ద్రవిడ మోడల్ 2.0 నినాదంతో మరోసారి అధికారంలోకి రావాలని స్టాలిన్ ప్రయత్నిస్తున్నారు. మరోవైపు అన్నాడీఎంకే-బీజేపీ కూటమి కూడా గట్టి పోటీకి సిద్ధమవుతోంది. అదనంగా సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రంగప్రవేశం చేయడంతో పోటీ త్రిముఖంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, జయలలిత నమ్మిన వ్యక్తిగా ఎదిగిన ఓపీఎస్ ఇప్పుడు ప్రత్యర్థి డీఎంకేలో చేరడం తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టే. ఈ నిర్ణయం రాబోయే ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

## నా బిడ్డకు న్యాయం జరగ లేదు...

విజయవాడ రక్షణ న్యూస్

ఆయేషా మీరా కేసులో కీలక పరిణామంగా ఆమె శరీర అవశేషాలకు గుంటూరు జిల్లా తెనాలిలో అంత్యక్రియలు నిర్వహించారు. కోర్టు ఆదేశాలతో ప్రత్యేక భద్రత నడుమ అంబులెన్స్‌లో అవశేషాలను తెనాలికి తరలించగా, ముస్లిం మతపెద్దలు, కుటుంబ సభ్యులు, స్థానికులు ర్యాలీగా ఈద్గా వరకు తీసుకెళ్లారు. అనంతరం ఇస్లాం మతాచారాల ప్రకారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయేషా మీరా తల్లి శంషాద బేగం మాట్లాడుతూ, ఆధారాలు లేవంటూ కేసును క్లోజ్ చేయడం ఘోర అన్యాయమని అన్నారు. ఎఫ్ఐఆర్‌లో వయస్సు తప్పుగా నమోదు చేయడం, సీన్ ఆఫ్ అఫెన్స్‌ను కడిగేయడం వల్లే న్యాయం దూరమైందని ఆరోపించారు. రాజకీయ నాయకులు, ధనవంతులకు ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం అన్న భావన సమాజంలో పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారించాలని ముఖ్యమంత్రి గారిని కోరుతున్నట్లు తెలిపారు. తండ్రి సయ్యద్ ఇక్బాల్ భాషా మాట్లాడుతూ, "ఆధారాలు లేవంటున్నారు కానీ అన్ని ఆధారాలు ఉన్నాయి. ఈ కేసులో నిర్లక్ష్యం చేసిన అప్పటి పోలీసు అధికారులందరినీ విచారించి రిమాండ్‌కు పంపాలి" అని డిమాండ్ చేశారు. ముస్లిం సంప్రదాయం ప్రకారం ఖననం తర్వాత మళ్లీ శరీరాన్ని వెలికి తీయడం పెద్ద తప్పు అయినప్పటికీ, న్యాయం జరుగుతుందన్న ఆశతో రీ పోస్ట్‌మార్టంకు అంగీకరించామని తెలిపారు. అంత్యక్రియల అనంతరం ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ, "ఆయేషా మీరా కేసులో న్యాయం జరగలేదు. మానవ కోర్టుల్లో తప్పించుకున్నా, దేవుడి కోర్టులో బాధ్యులు తప్పించుకోలేరు" అని వ్యాఖ్యానించారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయేషా మీరా కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు.

## బొత్స సత్యనారాయణకు బ్రెయిన్ స్ట్రోక్

అమరావతి రక్షణ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ నిన్న రాత్రి అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. వైద్య పరీక్షల్లో ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం సిటీ న్యూరో సెంటర్లో ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. బొత్స ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆందోళన అవసరం లేదని వైద్యులు వెల్లడించారు.

గత ఏడాది జూన్‌లో వెన్నుపోటు దినం సందర్భంగా విజయనగరం జిల్లా చీపురుపల్లిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో బొత్స కుప్పకూలిన విషయం తెలిసిందే. అప్పట్లో డీహైడ్రేషన్, జ్వరం, బీపీ, షుగర్ పెరగడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారని వైద్యులు తెలిపారు. తాజాగా మళ్లీ ఆరోగ్య సమస్య తలెత్తడంతో పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

బొత్స ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ఎప్పటికప్పుడు బులెటిన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. ఆయనకు మెరుగైన చికిత్స అందుతోందని, పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని వైద్య వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## పెట్టుబడులతోనే ప్రగతి సాధ్యం...

రక్షణ న్యూస్ డస్క్

ముంబయిలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐడియాస్ ఆఫ్ ఇండియా--2026 సదస్సులో మంత్రి నారా లోకేష్ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను వి2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట ఇస్తే అది జరిగి తీరుతుందన్న నమ్మకం ఉందని, ఆయన ఇచ్చిన లక్ష్యాలను మించడమే తన కర్తవ్యమన్నారు. ఫైర్‌సైడ్ చాట్‌లో ప్రశ్నలకు సమాధానమిస్తూ, కష్టకాలంలో వెన్నంటి నిలిచిన పవన్ కళ్యాణ్ తనకు జీవితాంతం పెద్దన్నేనని అన్నారు. అమరావతి భవిష్యత్తు రాజధాని అని, ప్రతి వంద రోజులకు ఒకసారి అక్కడికి వెళ్లి అభివృద్ధి వేగాన్ని చూడాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాజధాని అంటే కేవలం నగరం కాదు, విశాఖపట్నం--అమరావతి--తిరుపతి కేంద్రంగా ఎకనమిక్ రీజియన్లు, పారిశ్రామిక క్లస్టర్లు నిర్మిస్తున్నామని తెలిపారు. డేటా సెంటర్ పాలసీ, కలెక్టివ్ ఫెడరలిజం ద్వారా దేశానికే లాభం చేకూరే విధంగా రాష్ట్రం పనిచేస్తోందని లోకేష్ చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.16 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాయని గుర్తుచేశారు. పెట్టుబడుల రాకకు అనుభవజ్ఞుడైన సీఎం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రధాన కారణాలన్నారు. తిరుమల లడ్డూలో 2019--24 మధ్య జరిగిన కల్తీపై స్పందిస్తూ, బాధ్యులు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ భక్తులకు క్షమాపణలు చెబుతూ, వరల్డ్ క్లాస్ టెస్టింగ్ ఫెసిలిటీ నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే రెడ్ బుక్‌లో జగన్ పేరు ఉందా లేదా అన్నది త్వరలో తెలుస్తుందన్నారు. దేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా గ్లోబల్ ఫోరాల్లో రాజకీయాలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్‌ను విమర్శించారు. పిల్లల సోషల్ మీడియా వినియోగంపై కఠిన గార్డ్‌రైల్స్ అవసరమని, 90 రోజుల్లో సరైన ఫ్రేమ్‌వర్క్ తీసుకొస్తామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.


## లిక్కర్ పాలసీ కేసులో అందరికీ విముక్తి

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ప్రత్యేక న్యాయమూర్తి జితేందర్ సింగ్ సంచలన తీర్పు ఇచ్చారు. రౌస్ అవెన్యూ కోర్టు 2021 ఎక్సైజ్ పాలసీకి సంబంధించి నమోదైన కేసులోని అన్ని 23 మంది నిందితులను విముక్తి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆప్ నాయకుడు మణీష్ సిసోడియాలకు కోర్టు డిశ్చార్జ్ మంజూరు చేసింది. చార్జ్‌షీట్‌లో సాక్ష్యాలతో మద్దతు లేని అంశాలు ఉన్నాయని, "మిసలీడింగ్ అవేరేమెంట్స్ "తో పాటు అంతర్గత విరుద్ధతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. కేజ్రీవాల్‌ను సరైన ఆధారాలు లేకుండా కేసులో ఇరికించారని, సిసోడియాపై ప్రాథమిక కేసు నిలబడే పరిస్థితి లేదని కోర్టు స్పష్టం చేసింది. ప్రధాన నిందితుడిగా పేర్కొన్న కుల్దీప్ సింగ్‌పై కూడా స్పష్టమైన ఆధారాలు లేవని పేర్కొంది. దర్యాప్తులో లోపాలపై సీబీఐ అధికారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశాలు ఇచ్చింది. ఈ తీర్పుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందిస్తూ, న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలిచిందని తెలిపారు. "నేను కడిగిన ముత్యంలా బయటికి వస్తానని మొదట్నుంచే చెప్పాను. ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు పేర్కొన్నాను. అదే నిజమైంది" అని అన్నారు. కోర్టు తీర్పు రాకుండానే తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, కష్టకాలంలో అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై మరింత ఉత్సాహంతో ప్రజాసేవ చేస్తానని కవిత వెల్లడించారు. సుమారు 530 రోజులు జైలులో ఉన్న మణీష్ సిసోడియా, 156 రోజులు జైలు జీవితం గడిపిన అరవింద్ కేజ్రీవాల్‌కు ఈ తీర్పుతో ఊరట లభించింది. కేంద్ర దర్యాప్తు సంస్థల పాత్ర, రాజకీయ కక్ష ఆరోపణలపై ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

# గాంధీ సరోవర్ ప్రాజెక్ట్

## అభివృద్ధి మంత్రామా? పర్యావరణ విధ్వంసమా?

**హైదరాబాద్ :** హైదరాబాద్ లైఫ్ లైన్ అయిన మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావాలనే పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వం 'గాంధీ సరోవర్' అనే ప్రతిష్టాత్మక రిజర్వాయర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. బండ్లగూడ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా అటు వరదల ఉధృతిని అరికట్టడంతో పాటు, ఇటు నగరం నడిబొడ్డున పర్యావరణ సమతుల్యతను కాపాడాలని అధికారులు భావిస్తున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా రాబోయే ఈ మార్పు నగర ముఖచిత్రాన్నే మారుస్తుందని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. అయితే, మ్యాప్‌లో గీసిన ఈ ప్లాన్ క్షేత్రస్థాయిలో ఉన్న వేలాది కుటుంబాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ముఖ్యంగా మధుపార్క్ వంటి కాలనీలు ఈ ప్రాజెక్టు వల్ల పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. అభివృద్ధి అనే పదానికి అర్థం తమ ఇళ్లను కూల్చడమేనా అని మధుపార్క్ నివాసితులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దశాబ్దాల కాలంగా రూపాయి రూపాయి పోగేసి, ఎన్నో కలలతో కట్టుకున్న తమ గూడు ఒక్క రాత్రిలో అక్రమ కట్టడంగా మారిపోవడం వారిని కలిచివేస్తోంది. మార్కింగ్‌ల పేరుతో అధికారులు తిరుగుతుంటే, రేపు తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనతో ఆ ప్రాంత వాసులకు కంటిమీద కునుకు కరువైంది. కేవలం ఒక ప్రాజెక్టు కోసం తరతరాలుగా ఉంటున్న మనుషులను రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుండి ఎలాంటి స్పష్టమైన భరోసా లభించకపోవడం ఈ కాలనీల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడటానికి ప్రధాన కారణమైంది. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం చట్టపరమైన పత్రాలు. స్థానికుల వద్ద అన్ని అనుమతులతో కూడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని బఫర్ జోన్ లేదా ఎఫ్.టి.ఎల్ పరిధిలోకి వస్తుందని ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. ఇన్నాళ్లూ మున్సిపల్ పన్నులు వసూలు చేసి, కరెంటు కనెక్షన్లు ఇచ్చి, రిజిస్ట్రేషన్లు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు అకస్మాత్తుగా అవన్నీ నిబంధనలకు విరుద్ధమని చెప్పడం విడ్డూరంగా ఉందని బాధితులు వాపోతున్నారు. చట్టబద్ధంగా కొనుక్కున్న ఆస్తులకు రక్షణ లేకపోతే సామాన్య మధ్యతరగతి మనిషి ఎవరిని నమ్మాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ డాక్యుమెంట్ల పంచాయితీ ఇప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పెద్ద యుద్ధంగా మారింది. మరో కోణంలో చూస్తే, ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నగర భవిష్యత్తు కోసం అనివార్యమైనదిగా చూస్తోంది. మూసీ నదికి వచ్చే భారీ వరదలను నియంత్రించకపోతే భవిష్యత్తులో హైదరాబాద్‌కు ముప్పు తప్పదని, అందుకే గాంధీ సరోవర్ వంటి రిజర్వాయర్లు అవసరమని అధికారులు వాదిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం ద్వారా నగరానికి కొత్త కళ వస్తుందని, పర్యావరణ పరంగా కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని వారి వాదన. బాధితులకు తగిన పరిహారం అందిస్తామని లేదా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం



హామీ ఇస్తున్నప్పటికీ, తమ సొంత ఇళ్లను వదిలి ఇరుకు గదుల్లోకి వెళ్లడానికి ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరు. ప్రస్తుతం బండ్లగూడలో పరిస్థితి నివ్వుకణికలా ఉంది. ఒకవైపు సర్వేలు నిర్వహిస్తున్న అధికారులు, మరోవైపు తమ ఇళ్లను కాపాడుకోవడానికి ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ప్రజలతో ఆ ప్రాంతం నిరంతరం యుద్ధభూమిని తలపిస్తోంది. అభివృద్ధి పేరుతో సామాన్యుల హక్కులను కాలరాయవద్దని పౌర సమాజం నుండి కూడా మద్దతు లభిస్తోంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మొండిగా ముందుకు తీసుకెళ్తుందా లేక ప్రజల విజ్ఞప్తులను మన్నించి తన ప్రణాళికను సవరిస్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, అభివృద్ధి కింద నలిగిపోతున్న సామాన్యుడి ఆవేదన మాత్రం హైదరాబాద్‌లో పెద్ద చర్చకు దారితీసింది.

### అప్పుడు 12... ఇప్పుడు 50

హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా భావిస్తున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మూసీ తీర ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇక్కడ ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కిస్మత్‌పురా, దర్గా డివిజన్ల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ కూడా జారీ కావడంతో స్థానికంగా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్, ఉప్పర్‌పల్లి పరిధిలోని పలు కీలక నిర్మాణాలను అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు. ముఖ్యంగా మధు పార్క్ రిడ్జ్ వంటి ప్రముఖ అపార్ట్‌మెంట్లు కూడా 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలోకి వస్తుండటంతో వాటి భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. గతంలో ఈ ప్రాంతంలో బఫర్ జోన్ నిబంధనలు వేరుగా ఉన్నప్పటికీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. దీనివల్ల గతంలో అనుమతులు పొంది నిర్మించిన భవనాలు కూడా ఇప్పుడు ప్రభుత్వ సేకరణ పరిధిలోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది. చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 2004 సంవత్సరంలో మూసీ బఫర్ జోన్ కేవలం 12 మీటర్లుగా మాత్రమే ఉండేది. అయితే నది పరిరక్షణ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 2012లో ఈ పరిమితిని 50 మీటర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మధు పార్క్ రిడ్జ్ వంటి భారీ నివాస సముదాయాలు ఇప్పుడు బఫర్ జోన్ పరిధిలోకి వచ్చాయి. అప్పట్లో నిబంధనల ప్రకారమే అనుమతులు పొందినప్పటికీ, ప్రస్తుత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్మాణాలను సేకరించడం అనివార్యమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు భరోసా ఇస్తూ, ప్రభుత్వం ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తుందని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం అపార్ట్‌మెంట్ వాసులకు పరిహారం చెల్లించి, ఆ తర్వాతే ఆయా నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కేవలం బలవంతంగా ఖాళీ చేయించడం కాకుండా, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తామని స్పష్టం చేశారు. భూసేకరణలో పారదర్శకత పాటిస్తూ, బాధితుల నుంచి వచ్చే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు ప్రభుత్వం తరపున అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం మొత్తం 83 ఎకరాల 13 గుంటల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భారీ విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు భూములు, నివాస ప్రాంతాలను గుర్తించి, వాటి యజమానులతో సంప్రదింపులు జరిపేందుకు

## న్యాయం ఎవరి బాధ్యత?

ఆయేషా మీరా హత్య కేసు నేడు మళ్లీ దేశవ్యాప్తంగా చర్చకు రావడానికి కారణం ఒక కొత్త ఆధారం కాదు, కొత్త మలుపు కాదు. న్యాయం జరగలేదన్న భావన మాత్రమే. రెండు దశాబ్దాలకు చేరువైన కాలం గడిచినా "ఆమెను ఎవరు చంపారు?" అన్న ప్రశ్నకు సమాధానం దొరకకపోవడమే ఈ కేసును ఇప్పటికీ కాల్చేస్తున్న నిజం. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్ గదిలో ఆయేషా మీరా రక్తపు మడుగులో మృతి చెందిన రోజు---ఆ రోజు రాష్ట్రం ఉలిక్కిపడింది. హాస్టల్‌లో ఉన్న ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మరణిస్తే, అది కేవలం వ్యక్తిగత ఘటనగా మిగలదు. సమాజం, భద్రత, వ్యవస్థలు అన్నింటిపైనా ప్రశ్నలు లేవనెత్తుతుంది. కానీ ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన దర్యాప్తే మొదటి నుంచే అనుమానాల నీడలో నడిచింది. ఘటనలో తొలుత పోలీసులు ఒక యువకుడిని నిందితుడిగా చూపించారు. కానీ ఆయేషా తల్లిదండ్రులు ఆ దిశను ఎప్పటికీ అంగీకరించలేదు. తమ కుమార్తె మరణానికి అతనే కారణమన్న వాదనలో నిజం లేదని వారు మొదటి నుంచే స్పష్టంగా చెప్పారు. అసలు దోషులు వేరే ఉన్నారని, రాజకీయంగా ప్రభావవంతమైన వర్గాలపై అనుమానాలు ఉన్నాయని వారు పదేపదే పేర్కొన్నారు. అయితే ఆ ఆరోపణలపై లోతైన దర్యాప్తు జరగకపోవడం, కనీస స్థాయిలోనైనా ప్రశ్నలు లేవనెత్తకపోవడం---వ్యవస్థల ఉద్దేశాలపై అనుమానాలకు తావిచ్చింది. సంవత్సరాల తరబడి ఈ కేసు కోర్టుల్లో నడిచింది. విచారణలు, వాయిదాలు, వాదనలు కొనసాగాయి. చివరకు కోర్టు నిందితుడిగా చూపించిన వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించింది. ఒక కోణంలో అది న్యాయమే. కానీ అదే సమయంలో ఒక పెద్ద శూన్యం మిగిలింది. ఒక వ్యక్తి నిర్దోషి అయితే---అసలు దోషులు ఎవరు? అన్న ప్రశ్నకు సమాధానం లేకుండా కేసు అక్కడే నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో ఆయేషా తల్లిదండ్రులు ఆశ్రయించిన చివరి మార్గం సీబీఐ. దేశంలోనే అత్యుత్తమ దర్యాప్తు సంస్థగా భావించే సీబీఐ ఈ కేసులో నిజాన్ని వెలికి తీయగలదన్న నమ్మకం వారికి ఉంది. రీ--పోస్ట్‌మార్టం జరిగింది, పాత ఫైళ్లు తిరగేశారు, సాక్ష్యాలను తిరిగి పరిశీలించారు. కానీ కాలం తన పని చేసింది. సంఘటన జరిగిన సమయంలో సక్రమంగా సేకరించని ఆధారాలు, సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహణలో జరిగిన లోపాలు, అప్పటికే నశించిన సాక్ష్యాలు---ఇవన్నీ దర్యాప్తును అంధకారంలోకి నెట్టాయి. చివరకు సీబీఐ కూడా "స్పష్టమైన ఆధారాలు లేవు" అంటూ నివేదిక ఇచ్చింది. న్యాయపరంగా అది సమంజసమే కావచ్చు. కానీ 19 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్న ఒక కుటుంబానికి అది సరిపోతుందా? అత్యంత శక్తివంతమైన దర్యాప్తు సంస్థ కూడా చేతులెత్తేస్తే---అలాంటి సందర్భాల్లో న్యాయం ఎవరి కోసం ఉంటుంది? ఈ కేసులో అత్యంత బాధాకరమైన విషయం ఇదే. ఆధారాలు దొరకలేదన్న మాట వెనుక దాగి ఉన్నది---మొదట్లో జరిగిన నిర్లక్ష్యం. ఒక హత్య కేసులో సీన్ ఆఫ్ అఫెన్స్‌ను శాస్త్రీయంగా సంరక్షించకపోతే, ఆధారాలను కాపాడుకోకపోతే, సాక్ష్యాలను భద్రపరచకపోతే---తరువాత ఎవరూ ఏమీ చేయలేరు. అప్పుడు ఆ తప్పులకు బాధ్యత ఎవరిది? ఆ వైఫల్యాలకు శిక్షలు ఎక్కడ? ఈ ప్రశ్నలకు సమాధానం లేకపోవడమే ప్రజల్లో ఆగ్రహాన్ని, అనుమానాలను పెంచుతోంది. ముఖ్యంగా ప్రభావవంతుల పాత్రపై అప్పట్లో వినిపించిన ఆరోపణలకు స్పష్టమైన సమాధానాలు రాకపోవడం, దర్యాప్తు సంస్థల మౌనం---నమ్మకాన్ని మరింత దెబ్బతీసింది. న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను గౌరవించాల్సిందే. కానీ అదే సమయంలో ప్రజల సందేహాలకు పారదర్శక సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత కూడా వ్యవస్థలదే. ఈ నేపథ్యంలో ఆయేషా మీరా శరీర అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగించి, తెనాలిలో మరోసారి ముస్లిం సంప్రదాయాల ప్రకారం పూడ్చిన దృశ్యం---ఒక భావోద్వేగ ఘట్టంగా నిలిచింది. అది ముగింపు కాదు. అది ఒక ప్రశ్నార్థకం. కన్నీళ్లతో తల్లిదండ్రులు పలికిన మాటలు---"మాకు న్యాయం జరగలేదు"---సమాజాన్ని ఆలోచనలో ముంచాయి. ఈ కేసు కేవలం గతానికి చెందినది కాదు. ఇది భవిష్యత్తుకు హెచ్చరిక. ఒకవేళ వ్యవస్థలు తమ తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకపోతే, మరో ఆయేషా మీరా కథ రాయకుండా ఎవరు ఆపగలరు? ఆధారాల సేకరణలో కఠిన ప్రమాణాలు, రాజకీయ ప్రభావాలకు అతీతమైన దర్యాప్తు, బాధిత కుటుంబాలకు నిజమైన సమాధానాలు---ఇవి ఇకనైనా అమలవ్వాల్సిన అవసరం ఉంది. ఆయేషా మీరా పేరు నేడు ఒక వ్యక్తి మాత్రమే కాదు. అది న్యాయం కోసం ఎదురుచూస్తున్న వేలాది ఆడబిడ్డల ప్రతీక. ఈ కేసులో నిజం వెలుగులోకి రాకపోతే-"న్యాయం ఎవరికీ?" అన్న ప్రశ్న సమాజాన్ని వెంటాడుతూనే ఉంటుంది. ఇది ఆరోపణల కథ కాదు. ఇది వ్యవస్థలు తమ అద్దంలో తాము చూసుకోవాల్సిన సమయం వచ్చిందన్న పిలుపు.

## ఈ ఏడాది 10 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు

అమరావతి రక్షణ న్యూస్

ప్రతి పేదవానికి సొం తింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం శాసనసభలో హౌసింగ్, వ్యవసాయ శాఖల బడ్జెట్ పద్దులపై మాట్లాడిన సీఎం, ఇప్పటికే సుమారు 3 లక్షల ఇళ్లకు గృహప్రవేశాలు జరిగాయని, ఈ ఏడాది చివరి నాటికి 10 లక్షల ఇళ్లకు పైగా గృహప్రవేశాలు చేయిస్తామని ప్రకటించారు. ఇళ్లు లేని పేదలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో హౌసింగ్ రంగంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ఇసుక విధానాన్ని కూడా అవినీతికి వేదికగా మార్చారని విమర్శించారు. ఆ అక్రమాల్లో భాగస్వాములైన వారిని చట్టపరంగా శిక్షిస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2.20 లక్షల కుటుంబాలకు ఇంటి స్థలాలు లేవని, పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఉచితంగా కేటాయిస్తామని తెలిపారు. 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మించి, ఉచితంగా ఇంటి స్థలాలు కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగంపై మాట్లాడిన సీఎం చంద్రబాబు, అగ్రిటెక్‌తో పాటు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, ప్రభుత్వ మద్దతు అనే ఐదు సూత్రాలతో వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం 2025--26లో రూ.13,722 కోట్లు కేటాయించామని, 22.5 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రైతులకు మూడు విడతల్లో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని, ఇప్పటికే 47 లక్షల రైతులకు రూ.6,309 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాష్ట్రానికి రూ.14,230 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ.1.50 విద్యుత్ అందిస్తూ ఏపీని ఆక్వా కల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. నీటి భద్రత చర్యల వల్ల రాష్ట్రంలో భూగర్భ జలాల స్థాయి పెరిగిందని, విద్యుత్ వ్యయంలో రూ.95 కోట్ల ఆదా సాధ్యమైందని సీఎం తెలిపారు. రైతులు, కౌలు రైతులు సహా వ్యవసాయంపై ఆధారపడిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు.

## లోటు బడ్జెట్‌లోనూ అభివృద్ధి ఆగదు

ఏలూరు రక్షణ న్యూస్


ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కొత్త ఈదర గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి నిర్వహించారు. మల్లిబోయినపల్లి--కొత్త ఈదర మధ్య రూ.3.70 కోట్ల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించగా, కొత్త ఈదర గ్రామంలో సీసీ, బీటీ రహదారి పనులకు రూ.4.00 కోట్లు, రావిచెర్ల--కొత్త ఈదర ఆర్అండ్‌బీ రహదారి పనులకు రూ.1.25 కోట్లు, అలాగే రూ.36 లక్షలతో ఆయుష్మాన్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక వసతుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రైతులకు పండించిన పంటను తమకు నచ్చిన రైస్‌మిల్లుకు తీసుకెళ్లే స్వేచ్ఛ ఇచ్చామని, 48 గంటల్లోనే గిట్టుబాటు ధర రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం హెక్టారుకు రూ.16 వేలుగా చేసిన ఇన్‌పుట్ సబ్సిడీని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.25 వేలుకు పెంచిందన్నారు. అలాగే గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,650 కోట్లను చెల్లించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రక్షణ

శనివారం 28
ఫిబ్రవరి 2026

# రాకాస టీజర్ విడుదల తేదీ ఫిక్స్

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ మూవీలతో మంచి గుర్తింపును సంపాదించుకున్న నటులలో సంగీత్ శోభన్ ఒకరు. ఈయన ఇప్పటివరకు తక్కువ సినిమాల్లో నటించినా మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఈ నటుడు రాకాస అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇందులో నయన్ సారిక హీరోయిన్గా కనిపించనుండగా, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదల ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తుంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ మూవీ విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్ల స్పీడును పెంచారు. తాజాగా ఈ మూవీ యూనిట్ ఈ సినిమాకు సంబంధించిన టీజర్ విడుదల తేదీని అనౌన్స్ చేసింది. మార్చి 1వ తేదీన ఈ చిత్ర టీజర్ను రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మూవీ టీజర్ గనుక ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నట్లయితే ప్రేక్షకుల్లో ఈ హర్రర్ ఫాంటసీ చిత్రంపై అంచనాలు భారీగా పెరిగే అవకాశం చాలా వరకు ఉంది. కొన్ని రోజుల క్రితం నిహారిక ఈ సినిమా ఈవెంట్ లో మాట్లాడుతూ... ఇదొక వినూత్నమైన ఫాంటసీ కామెడీ డ్రామా అని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని ధీమా వ్యక్తం చేసింది. గతంలో నిహారిక, సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో రూపొందిన ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ అనే వెబ్ సిరీస్ను కూడా నిర్మించింది. దీనికి మంచి ప్రేక్షకాదరణ లభించింది. మరి వీరి కాంబోలో రూపొందుతున్న రాకాస చిత్రం జనాల్ని ఆకట్టుకుంటుందో లేదో చూడాలి.






# మరో భారీ మల్టీ స్టారర్ రెడీ

బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తన మచ్ ఎవైటెడ్ నెక్స్ట్ మూవీ అనౌన్స్‌మెంట్‌తో మరోసారి అందరిలో ఆసక్తిని పెంచారు. వరుసగా తొమ్మిది బాక్సాఫీస్ విజయాలతో అదరగొట్టిన అనిల్ రావిపూడి కొత్త ప్రాజెక్ట్‌లో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటించనున్నారు. ఈ2, ఈ3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైనర్‌ల తర్వాత అనిల్, వెంకటేష్ కలయికలో వస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో రెండవ చిత్రం. దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గుబాటి, నందమూరి కుటుంబాల నుంచి వచ్చిన స్టార్స్‌ని కలిపి ఈ కొత్త చిత్రాన్ని ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే కంప్లీట్ ఎంటర్టైనర్‌గా ఉండబోతుంది. ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది, ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న భారీ అంచనాలను తగ్గట్టుగా దర్శకుడు స్క్రిప్ట్‌ను జాగ్రత్తగా మెరుగుపరుస్తున్నాడు. సాంకేతిక బృందం గురించి వివరాలు, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తారు. ఈ చిత్రం 2027 సంక్రాంతికి విడుదల కానుంది.

# సూపర్ హిట్ కాంబోలో సాయి పల్లవి

సూపర్ హిట్ కాంబో విజయ్ సేతుపతి, మణిరత్నం మరోసారి జతకట్టబోతున్నారు. లైకా ప్రొడక్షన్స్ సమర్పణలో మద్రాసు టాకీస్ బ్యానర్‌పై రూపొందిన 'చెక్క చివంద వానమ్' అనే చిత్రంతో ఇప్పటికే ఈ కాంబో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ మూవీ తెలుగులో 'నవాబ్' పేరుతో విడుదలైంది. అయితే ఇప్పుడు విజయ్ సేతుపతి, మణిరత్నం కాంబోలో రాబోతున్న ఈకొత్త సినిమా మునుపటి ప్రాజెక్ట్ కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుందని ఇప్పటికే సేతుపతి పంచుకున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ కూడా కంప్లీట్ అయినట్లు తమిళ వర్గాల్లో టాక్ నడుస్తుంది. దీంతో ఈ చిత్రం ఎప్పుడు పట్టాలెక్కనుందని ఆడియన్స్ చూస్తుండగా.. తాజాగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ బజ్ నెట్టింట దర్శనమిచ్చింది. ఇందులో ఫిమేల్ లీడ్ కోసం నేచురల్ బ్యూటీ సాయిపల్లవిని సంప్రదించారని సమాచారం. కథ నచ్చడంతో సాయి పల్లవి కూడా ఈ ప్రాజెక్ట్ ఓకే చేసిందని తెలుస్తుండగా.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.




# 22 ఏళ్లకే హీరోయిన్.. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్లో బ్యూటీ

సినిమా ఇండస్ట్రీలో కొంతమందికి ఎన్నో సినిమాల్లో నటించినా రాని క్రేజ్, కొంతమంది బ్యూటీలకు మాత్రం ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ లో వచ్చేస్తూ ఉంటుంది. అలా ఒక్క సినిమాతో అదిరిపోయే రేంజ్ క్రేజ్ రావాలంటే, కచ్చితంగా ఆ సినిమా సూపర్ సాలిడ్ విజయాన్ని అందుకుని ఉండాలి, లేదంటే అందులో ఆ నటి మంచి నటననైనా కనబరిచి ఉండాలి. అలా చేసిన మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని, ఓవర్ నైట్ లో స్టార్ హీరోయిన్ క్రేజ్ను సంపాదించుకున్న బ్యూటీలలో అనీత్ పద్ద ఒకరు. ఈమె పోయిన సంవత్సరం విడుదల అయిన సయ్యారా చిత్రంతో వెండితెరకు పరిచయం అయింది. ఈ బాలీవుడ్ చిత్రం పెద్దగా అంచనాలు లేకుండా విడుదల అయింది. కానీ రిలీజ్ అయిన తర్వాత మాత్రం అద్భుతమైన రీతిలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దానితో ఈ మూవీ ఏకంగా ప్రపంచవ్యాప్తంగా 570 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి, పోయిన సంవత్సరం హిందీ సినీ పరిశ్రమలో భారీ విజయాన్ని అందుకున్న సినిమాల లిస్టులో చేరిపోయింది. ఈ చిత్రం పోయిన సంవత్సరం జూలై 18వ తేదీన విడుదల అయింది. ఈ చిత్రం విడుదల అయిన సమయానికి ఈ ముద్దుగుమ్మ వయస్సు కేవలం 22 సంవత్సరాలు మాత్రమే. 22 సంవత్సరాల వయస్సులోనే ఈమెకు అద్భుతమైన విజయం దక్కడంతో ఓవర్ నైట్ లో ఈమెకు స్టార్ హీరోయిన్ క్రేజ్ వచ్చింది. అలాగే ఈ సినిమా చూసిన వారంతా కూడా ఇందులో అనీత్ పద్ద నటన అద్భుతంగా ఉందని, ఈ బ్యూటీకి చాలా మంచి ఫ్యూచర్ ఉందని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మొదటి చిత్రంతోనే మంచి విజయాన్ని అందుకున్న ఈమె ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో అద్భుతమైన క్రేజ్ ఉన్న నటిగా గుర్తింపును సంపాదించుకుంది.



# మెగా ఫ్యామిలీలో మోగనున్న పెళ్లి బాజాలు



మెగా ఫ్యామిలీలో పెళ్లి బాజాలు మోగబోతున్నాయి. నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు శిరీష్ వివాహ తేదీ దగ్గరపడుతుండటంతో సెలబ్రేషన్స్ మొదలెట్టారు. తన ప్రియురాలు నయనికతో కలిసి మార్చి 6వ తేదీన పెళ్లిపీటలు ఎక్కబోతున్నట్లు అధికారికంగా ప్రకటంటించారు. మార్చి 2వ తేదీన అల్లు స్టూడియోస్‌లో ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్స్ ఉంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు శిరీష్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. దీంతో అల్లు వారి ఇంట వేడుకలు ఆరంభం అయ్యాయి. ప్రస్తుతం హల్దీ ఫంక్షన్ వేడుకగా సాగుతోంది. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను అల్లు శిరీష్ వదిన, అల్లు అర్జున్ భార్య స్నేహా రెడ్డి సోషల్ మీడియాలో విడుదల చేశారు. అల్లు శిరీష్, నయనికల నిశ్చితార్థ వేడుక గత ఏడాది అక్టోబర్ 31వ తేదీన జరిగిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది అల్లు అరవింద్ కుటుంబం. ఈ సందర్భంగా వారు ఉంగరాలు మార్చుకున్నారు. అప్పట్లో పెళ్లి తేదీని వెల్లడించలేదు. ఈ ఏడాది పెళ్లి జరుగుతుందనే హింట్ అప్పుడే ఇచ్చారు. దీనికి అనుగుణంగానే తాజాగా మార్చి 6వ తేదీన ముహూర్తాన్ని ఖరారు చేశారు.

Printed and Published by G. Narendra, Editor,1-4-55, Bapatla, Bapatla District.Phone: 8185 997507...